TGTEL/25/A0827

# ప్రజా దివాస్

తెలుగు దినపత్రిక

prajadivvs57@gmail.com

విలేఖరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ ... ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా.. ? బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా ... ? అయితే రండి ... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

సెల్ : 9000281049

నియోజకవర్గ ఇంచార్జ్‌లు, జిల్లా స్టాఫర్‌లు మండల రిపోర్టల్‌లు కావలెను...

సంపుటి : 3 సంచిక : 251 | శుక్రవారం 04-09-2026 | ఎడిటర్: ఎస్ ఎన్ మౌనిక | పేజీలు : 8 వెల 3 /-

## అభినందన్ వర్ధమాన్ ఇక కమర్షియల్ పైలట్‌గా..

**వాయుసేన నుంచి ముందస్తు రిటైర్మెంట్..!**

- అభినందన్ వర్ధమాన్ కొత్త కెరీర్
- వాయుసేన నుంచి ముందస్తు రిటైర్మెంట్
- గోవాకు చెందిన ఖీ్91లో కమర్షియల్ పైలట్‌గా చేరిక
- 22 ఏళ్ల పాటు వాయుసేనలో సేవలు
- 2019లో పాక్ ఖీ-16ను కూల్చిన అభినందన్



మిగతాది 2లో

## నల్సార్ విద్యార్థులకు ఊరట..

**బార్ కౌన్సిల్‌పై 'సుప్రీం' ఆగ్రహం**



2లో..

- బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీజX)పై సుప్రీంకోర్టు ఆగ్రహం
- 2026 బ్యాచ్ విద్యార్థులపై నమోదు నిషేధం వివాదం
- విద్యార్థులపై క్రమశిక్షణ చర్యలకు BCIకి అధికారం లేదని స్పష్టం
- BCI ఆదేశాలను తీవ్రంగా తప్పుబట్టిన సుప్రీంకోర్టు
- న్యాయవాదులుగా నమోదు విషయంలో విద్యార్థులకు ఊరట
- విద్యార్థులతో వివాదంలో BCI జోక్యంపై సీజెఐ అసహనం

## ప్రైవేటు స్కూళ్లలో 25 శాతం ఉచిత ప్రవేశాలు.. అధ్యయనానికి కమిటీ



అమరావతి: ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ఉచిత ప్రవేశాల మార్గదర్శకాల సవరణకు రాష్ట్ర స్థాయి కమిటీ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విద్యా హక్కు చట్టం 2009 సెక్షన్ 12(1)(ఎ) ప్రకారం.. రాష్ట్రంలోని ప్రైవేటు అన్-ఎయిడెడ్ పాఠశాలల్లో నిరుపేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు 25 శాతం ఉచిత ప్రవేశాలు కల్పించేందుకు ఉన్న మార్గదర్శకాలను సవరించే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సుప్రీంకోర్టు ఈ ఏడాది జనవరి 13న ఇచ్చిన తీర్పు ప్రకారం... జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ జారీ చేసిన ఆదేశాలకు అనుగుణంగా ప్రస్తుత నిబంధనలను సవరించి, పకడ్బందీగా అమలు చేసేందుకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఛైర్‌పర్సన్‌గా 16 మంది సభ్యులతో కూడిన రాష్ట్ర స్థాయి కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె.

# మంత్రి కొండా సురేఖను బర్తరఫ్ చేయండి..

## గవర్నర్‌కు సీఎం లేఖ

- తెలంగాణ కాంగ్రెస్‌లో కీలక పరిణామం
- మంత్రి కొండా సురేఖపై వేటు
- సీఎం రేవంత్‌రెడ్డి బర్తరఫ్‌కు గవర్నర్‌కు లేఖ
- రాజీనామాకు సురేఖ ససేమిరా
- చిన్నారెడ్డిపైనా కాంగ్రెస్ చర్యలు
- చిన్నారెడ్డి స్థానంలో గద్వాల్ విజయలక్ష్మి
- మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా నేరెళ్ల శారద
- కుడా ఛైర్‌పర్సన్‌గా జి. సుధారాణి

హైదరాబాద్: తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. మంత్రి కొండా సురేఖ , ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిపై కాంగ్రెస్ అధిష్ఠానం వేటు వేసింది. ఈ మేరకు హైకమాండ్ నిర్ణయం తీసుకుంది.

క్యాబినెట్ నుంచి సురేఖను తొలగించేందుకు అధిష్ఠానం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో సీఎం రేవంత్‌రెడ్డి గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లాకు లేఖ పంపారు. ఆమెను తక్షణమే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని సీఎం కోరారు. రాజీనామాకు కొండా సురేఖ ససేమిరా అనడంతో ఆమెను తొలగించాలని సీఎం సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది. సీఎం లేఖపై గవర్నర్ త్వరలో నిర్ణయం తీసుకోనున్నారు.

మిగతాది 2లో



## అక్టోబరు నుంచి కొత్త పింఛన్లు: మంత్రి లోకేశ్



మిగతాది 2లో

అమరావతి: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ దశల వారీగా కొత్త పింఛన్లు మంజూరు చేయనున్నట్టు తెదేపా వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్

## కవితకు ఢిల్లీ హైకోర్టు నోటీసులు



ఢిల్లీ: 'ది పయనీర్' పత్రిక వ్యవహారంలో తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవితకు ఢిల్లీ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఆ పత్రికపై పరువు నష్టం ఆరోపణలు చేయొద్దని ఆమెను ఆదేశించింది. కవితతో పాటు మరో 14 మంది జర్నలిస్టులు, యూట్యూబ్ ఛానళ్లు, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లపైనా కోర్టు ఆంక్షలు

## వెలిగొండ, పోలవరం ఎడమ కాలువకు నీటి విడుదలపై వైకాపా దుష్ప్రచారం

**వైకాపా తప్పుడు ప్రచారంపై చంద్రబాబు ఆగ్రహం**

**జలాశయాల్లో నీటి సరఫరాపై దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శ**



మిగతాది 2లో

- ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరించాలని మంత్రులకు ఆదేశం
- రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు సమాచారం
- నిత్యావసర ధరల నియంత్రణకు చర్యలు
- నరసాపురం 6 వేల ఎకరాల భూముల సమస్య పరిష్కారానికి ఆదేశం
- సూర్యఘర్ వినియోగంలో ఏపీని మొదటి స్థానానికి తీసుకురావాలని లక్ష్యం
- స్థానిక సంస్థల ఎన్నికలు ఈ ఏడాదిలోపే పూర్తి చేయాలని ఆదేశం

# హైకమాండ్‌ను సీఎం రేవంత్ బ్లాక్‌మెయిల్ చేశారు: కొండా సురేఖ

## రేవంత్‌రెడ్డిపై కొండా సురేఖ తీవ్ర ఆరోపణలు

- హైకమాండ్‌ను సీఎం బ్లాక్‌మెయిల్ చేశారని వ్యాఖ్య
- తన వివరణ తీసుకోకుండానే బర్తరఫ్ చేశారని ఆరోపణ
- తనపై, మాజీ ఓఎస్డీ సుమంత్‌పై కుట్ర చేశారని వ్యాఖ్య
- మంత్రి పొంగులేటి, ఎంపీ వెం నరేందర్‌రెడ్డి, సీఎం సోదరులపై ఆరోపణలు
- తాను తప్పు చేయలేదని స్పష్టం
- కాంగ్రెస్‌కు రాజీనామా చేసే ఆలోచన లేదని వెల్లడి
- ఎమ్మెల్యేగా కొనసాగుతానని కొండా సురేఖ ప్రకటన
- కాంగ్రెస్ మళ్లీ గెలవాలంటే పార్టీలో మార్పులు అవసరమని వ్యాఖ్య



## సీఎంకు బ్లాక్‌మెయిల్ చేయాల్సిన అవసరమేంటి?: ఆది శ్రీనివాస్



## టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ అరెస్ట్..

**ఆస్తులు చూస్తే కళ్లు బైర్లు కమ్మాల్సిందే!**

సూర్యాపేట: సూర్యాపేట టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సోమయ్యను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలు, ఫిర్యాదుల నేపథ్యంలో ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



# సంపాదకీయం

## పాశ్చాత్య వెలుగులే మనకు చీకట్లు!

మనం వాస్తవంగా ఒక అలసిన శతాబ్దంలో జీవిస్తున్నాం. ఈ ధరిత్రిపై భారత భూమికి సుదూర దేశాలలో గతించిన యుగాలలో నిర్మాణమైన మేధోసౌధం శిథిలాలలో నివసిస్తున్నాం. ఆ మేధోసౌధం మనదే అని విశ్వసిస్తున్నాం. అదొక తప్పుడు విశ్వాసం, భ్రమ. దానినుంచి బయటపడలేనితనం మనలను కుంగదీస్తోంది. ప్రతిరోజూ ఎక్కడో ఒకచోట మానవ తప్పిదం కారణంగా ఏదో ఒక దుర్ఘటన సంభవిస్తోంది. నేపాల్ వరద బీభత్సం, గాజాలో జాతి సంహారం, డోనాల్డ్ ట్రంప్ అరాచకత్వం ప్రపంచాన్ని బాధిస్తున్నాయి, వేధిస్తున్నాయి. మన జీవనోన్నతికి ఏ భావాలయితే తోడ్పడాలో అవే మనకు వ్యతిరిక్తమయ్యాయి.

'భవిష్యత్తుపై గతం తన వెలుగులు ప్రసరింపజేయడం మానేసినందున మనిషి మనసు అంధకారంలో సంచరిస్తోంది' అని రెండు శతాబ్దాల క్రితం అలెక్సిస్ డి టోక్‌విల్లే అనే ఫ్రెంచ్ మేధావి వ్యాఖ్యానించాడు. ఇప్పుడు మనమూ అటువంటి సంకటస్థితిలోనే ఉన్నాం. ఒక సంధికాలంలో కొట్టుమిట్టాడుతున్నాం. గతించిన కాలపు భావాలతో భవిష్యత్తులోకి వెళ్లడానికి ప్రయత్నించడమే ఈ పరిస్థితికి ప్రధాన కారణం. యూరోప్ ఘనమైన గతం కానీ, అమెరికా ప్రశస్త వర్తమానం కానీ మన భవిష్యత్తుకు మార్గదర్శకాలు కాలేవు. పాశ్చాత్య ఆధునికత మాసిపోయింది. కొత్తదనాన్ని కోల్పోయింది. దుర్గంధాన్ని వెదజల్లుతోంది. అయినా మనం రోజూ దానికి మెరుగులు దిద్ది మన పిల్లలకు నేర్పుతున్నాం.

ప్రజాస్వామ్యాన్నే తీసుకోండి. అదొక సమ్మోహన సమున్నత ఆదర్శం. గత శతాబ్దంలో అది ఒక విప్లవాత్మక భావం. ఇప్పుడు ప్రపంచానికి ప్రామాణిక ఆదర్శం. దానినే మనం ఉదారవాద ప్రజాస్వామ్యం అని పిలుస్తున్నాం. ప్రజా సార్వభౌమత్వం అనే మరో సమున్నత భావాన్ని పోటీదాయక ఎన్నికల ద్వారా అధిక సంఖ్యాకుల పాలన ప్రాతిపదికన ప్రాతినిధ్య ప్రభుత్వంగా మార్చివేశాం. అయితే మనం ప్రజాస్వామ్యంగా భావిస్తున్న పాలనా పద్ధతులు కొద్దిమందికి మాత్రమే స్వపరిపాలనను సమకూర్చాయి. ఆధునిక ప్రజాస్వామ్యం నిజానికి ప్రజలు సాధికారత కోల్పోయేలా చేసింది. రాజ్య వ్యవస్థను సర్వశక్తిమంతం చేసింది. నాయకత్వాలు జవాబుదారీతనం లేకుండా వ్యవహరించేందుకు తోడ్పడింది. మీడియా పూర్తిగా కార్పొరేట్ నియంత్రిత రంగం కావడానికి దోహదం చేసింది. ధనశక్తికి అపార ప్రాధాన్యమిచ్చింది. ఇవన్నీ ప్రజలను నిస్సహాయులను చేశాయి. ప్రజా సార్వభౌమత్వం బోలుమాటగా మిగిలిపోయింది. ప్రజాకర్షక రాజకీయాలు, మెజారిటీవాదం ఎన్నికైన నిరంకుశ ప్రభుత్వాలు.. ఆధునిక ప్రజాస్వామ్య రుగ్మతలు కావు, అవి మనం ప్రజాస్వామ్యంగా అంగీకరించి, అమలు జరుపుకుంటున్న యంత్రాంగం సహజ పరిణామాలు.

మన మరో గొప్ప ఆదర్శం జాతిరాజ్యం. ఏదో ఒక దానికి 'చెందిన' భావన, సొంతవారని భావించేవారితో సాంగత్యం, అనుబంధం పెంపొందించుకోవడం ప్రతి వ్యక్తికీ ఒక మానసిక అవసరం. ఆధునిక యుగంలో ప్రపంచాన్ని 'జాతులు' అనే రాజకీయ సమాజాలుగా విభజించి సుస్థిరపరచడం ద్వారా ఈ స్వతస్సిద్ధ మానవ అవసరాన్ని తీర్చారు. ఈ రాజకీయ సమాజాలే జాతి రాజ్యాలు. నిశితంగా పరిశీలిస్తే జాతులు అనేవి ఊహాజనిత సమాజాలు. ఇవి అధికార కేంద్రాలుగా పనిచేస్తూ తమ పరిధిలోని ప్రతి ఒక్కరి నుంచి తిరుగులేని విధేయతను కోరతాయి. ఇక్కడే, జాతి రాజ్యాలతో సమస్యలు తలెత్తుతున్నాయి. జాతి రాజ్యాల చరిత్రను చూస్తే అవి మనుషులను కలిపి ఉంచలేదు సరికదా వేరు చేశాయి. 'మనం', 'వారు' అనే భావనను నెలకొల్పి వైషమ్యాలు రెచ్చగొట్టాయి. ఈ రాజకీయ సమాజాల ప్రభావంతో ఇరుగుపొరుగువారినీ ద్వేషించడం జరుగుతోంది. ఇరవయో శతాబ్ది యుద్ధాలే ఇందుకు నిదర్శనం. ఈ సంకుచిత జాతీయవాదం జాత్యహంకారంగాను, యుద్ధోన్మాదంగానూ వెర్రితలలు వేసింది, వేస్తోంది. కూడు, గూడు, గుడ్డ మానవుని సహజ అవసరాలు. ఇవి అంత తేలిగ్గా తీరవు. తీరినా ఇంకా ఎన్నో కోరికలు ఉంటాయి. భౌతిక శ్రేయస్సును పరిపూర్ణంగా సమకూర్చుకోవాలని సదా స్వప్నిస్తాడు. ఆ స్వప్నసాధననే ఇరవయో శతాబ్దిలో 'అభివృద్ధి' అని చెప్పుకున్నారు. భౌతిక శ్రేయస్సును సమకూర్చుకోవడాన్ని మనం ఇప్పటికీ 'అభివృద్ధి'గా భావిస్తున్నాం. ఆ 'అభివృద్ధి' సాధనను ఒక ఉత్కృష్ట విషయంగా ఔదలదాలుస్తున్నాం. పారిశ్రామికీకరణ, పట్టణీకరణలతో అటువంటి అభివృద్ధిని సాధించాం.. ప్రైవేట్ ఆస్తి, స్వేచ్ఛా విపణి, అంతర్జాతీయ పెట్టుబడులకు ప్రాధాన్యమిచ్చే పెట్టుబడిదారీ ఆర్థిక విధానం ఆ అభివృద్ధికి ప్రధాన చోదకశక్తి. అయితే ఆ అభివృద్ధి స్వప్నాలు వికటిస్తున్నాయి. సిరిసంపదలు కొంతమందికి మాత్రమే అందుబాటులో ఉంటున్నాయి. సిరులు సృష్టించే శ్రమ జీవులకు ఏమీ దక్కడం లేదు. జీవన ప్రమాణాలు ఇతోధికంగా మెరుగుపడినప్పటికీ మనిషి ఆకాంక్షలూ పెరిగిపోయాయి. ఫలితంగా సహజవనరులు తరిగిపోతున్నాయి. మన ధరిత్రి మానవుని అవసరాలను తీర్చగలదేగానీ అతడి అపరిమిత భోగలాలసను సంతృప్తిపరచలేదు. ఈ కారణంగానే పలు సంక్షోభాలు, ముఖ్యంగా పర్యావరణ విధ్వంసం సంభవిస్తోంది. దీనిని నిలిపివేయకపోతే ప్రకృతికి, మానవేతర జీవకోటికి, భావి తరాలకు తీరని నష్టం వాటిల్లడం ఖాయం. విధ్వంసక అభివృద్ధి, ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం అనేవి మనం అనుసరిస్తున్న ఆర్థికాభివృద్ధి నమూనా లోపాలు కాదు, అవి దాని సహజ లక్షణాలు.

అజ్ఞానం, అసత్యాల నుంచి స్వేచ్ఛ సాధించడమే మన నాలుగో అన్వేషణ. ఆధునిక వైజ్ఞానిక పద్ధతి ఇందుకు తోడ్పడుతోంది. సమస్త జ్ఞాన రంగాలు అనుసరించాల్సిన నిర్దిష్ట నియమావళిని అది రూపొందించింది. ఏది సత్యం, ఏదసత్యం అనేదాన్ని నిర్ధారించింది. దీని ప్రకారం ఏది జ్ఞానం? సర్వత్రా ఒకే విధమైన ఫలితాలను ఇచ్చేది, క్రమబద్ధమైన ధ్రువీకరణకు సాధ్యమయ్యేదే ప్రామాణిక జ్ఞానం. సాంకేతిక విజయాలు ఆ జ్ఞానానికి అంతిమ రుజువు. ఈ పద్ధతి మానవ సమస్యలను పరిష్కరించడంలో సఫలమవుతున్నందున విజ్ఞానశాస్త్రం మన కాలపు కొత్త మతంగా పరిగణన పొందింది. అయితే అది మానవ మేధను సంకుచితపరిచింది. నైతిక ప్రాతిపదికలు కోల్పోయేలా చేసింది. పాశ్చాత్య మేధో ఆధిపత్యాన్ని నెలకొల్పింది.

ప్రతి మనిషీ సంతోషమయ జీవితాన్ని కోరుకుంటాడు, మానసిక సాంత్వనలకూ ఆరాటపడతాడు. భౌతిక సౌఖ్యం, మానసిక ప్రశాంతికి మానవుని అన్వేషణను మనం విధిగా పట్టించుకోవాలి. పాశ్చాత్య ఆధునికతతో అంకురించి ప్రపంచవ్యాప్తమైన 'లౌకికవాదం' అన్ని మతాల స్వభావాన్ని మార్చివేసింది. సమస్త సమాజాలూ లౌకికవాద భావజాలాన్ని ఆచరణలో కాకపోయినా సూత్రప్రాయంగా అంగీకరిస్తున్నాయి. మతం క్షీణించకపోగా నిర్దిష్ట మతపరమైన అనుయాయులను మరింత మతనిష్ఠతో వర్గీకరించడం జరుగుతోంది. విభిన్న మత వర్గాల మధ్య పోటీ పెచ్చరిల్లుతోంది. దీనివల్ల మత పరమార్థం ఉపేక్షితమవుతోంది. ప్రతి మతంలోను వ్యాపార, ఛాందసవాద ధోరణులు పెరుగుతున్నాయి.

## టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ అరెస్ట్..
### ఆస్తులు చూస్తే కళ్లు బైర్లు కమ్మాల్సిందే!

మొదటిపేజీ తరువాయి

ఆయన ఇళ్లలో గురువారం సోదాలు చేపట్టారు. సోమయ్య కార్యాలయంతో పాటు బంధువులు, అనుచరులకు చెందిన 7 ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. సోదాల్లో భారీగా ఆస్తుల డాక్యుమెంట్లు, నగదు, బంగారం, వెండి స్వాధీనం చేసుకున్నారు.

సోమయ్యకు చెందిన 3 ఎకరాల 3 గుంటల వ్యవసాయ భూమి, సూర్యాపేట, హయత్‌నగర్ పరిధిలో 5 రెసిడెన్షియల్ ప్రాపర్టీలను గుర్తించారు. వీటిలో జీం1, జీం2, జీం4ంపెంట్‌హౌస్ భవనాలతో పాటు రెండు గ్రౌండ్‌ఫ్లోర్ ఇళ్లు ఉన్నాయి. 8 ఓపెన్ ప్లాట్లు, రూ.4.63 లక్షల నగదు, బ్యాంకు ఖాతాల్లో రూ.13 లక్షల బ్యాలెన్స్, 709 గ్రాముల బంగారం, 1,750 గ్రాముల వెండి, రెండు కార్లు, మూడు ద్విచక్ర వాహనాలు, ఇంట్లో రూ.11 లక్షల విలువైన గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, బ్యాంకులో 66 తులాల బంగారం తాకట్టు పెట్టి రూ.49 లక్షల గోల్డ్ లోన్ ఉన్నట్లు గుర్తించారు. ఏసీబీ లెక్కల ప్రకారం మొత్తం ఆస్తుల విలువ రూ.3,54,36,490 అని తేల్చారు. బహిరంగ మార్కెట్‌లో వీటి విలువ భారీగా ఉండొచ్చని అధికారులు అంచనా వేశారు. సోమయ్య ఆస్తులపై ఏసీబీ మరింత లోతుగా విచారణ కొనసాగిస్తోంది. నిందితుడిని హైదరాబాద్‌లోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరచనున్నారు.

## సీఎంకు బ్లాక్‌మెయిల్ చేయాల్సిన అవసరమేంటి?: ఆది శ్రీనివాస్

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: మంత్రి పదవి నుంచి కొండా సురేఖ (ఖశీఅఝ ాబతీవఎష్ఞు) బర్తరఫ్ ఆమె స్వయం కృతాపరాధమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఆమెకు కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం అనేక అవకాశాలు ఇచ్చినట్లు చెప్పారు. ఈ మేరకు ఆయన ఓ వీడియో విడుదల చేశారు.

"కుటుంబ సభ్యులను కొండా సురేఖ అదుపులో పెట్టుకోలేకపోయారు. ఈ విషయంలో ఆమె విఫలమయ్యారు. సీఎం రేవంత్ రెడ్డి (=వఝుత్ష్ట =వ౧౧ఎ)పై పదేపదే విమర్శలు చేసి ప్రభుత్వాన్ని, పార్టీని బలహీనపర్చే ప్రయత్నం చేశారు. కొండా సురేఖ వ్యవహార శైలిని ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, అగ్రనేతలు సోనియా, రాహుల్, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సమగ్రంగా పరిశీలించారు. క్రమశిక్షణారాహిత్యాన్ని సహించవద్దనే ఈ నిర్ణయం తీసుకున్నారు. అధిష్ఠానాన్ని సీఎం రేవంత్ బ్లాక్‌మెయిల్ చేశారని కొండా సురేఖ అబద్ధాలు చెబుతున్నారు. సీఎంకు ఆ అవసరమేంటి?

ఆమెకు ఇచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోలేదు. పదే పదే తప్పులు చేశారు. ముఖ్యమంత్రిపై కుటుంబసభ్యులు తీవ్ర ఆరోపణలు చేస్తుంటే కనీసం వారించలేదు. గతంలోనూ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే సీఎం సర్దుకుపోయారు. ఇప్పుడు కూడా నోటికొచ్చినట్లు మాట్లాడినా సీఎం ఎక్కడా బయటపడలేదు. సోనియా, రాహుల్‌పై గౌరవముంటే కాంగ్రెస్‌ను బలహీనపర్చే పనులు ఎందుకు చేశారు? కొండా సురేఖతో పాటు సీనియర్ నేత చిన్నారెడ్డిని కూడా పదవి నుంచి తప్పించారు. సీఎంకు చిన్నారెడ్డి చాలా ఇష్టమైన నాయకుడు. కానీ పార్టీకి నష్టం కలిగిస్తే ఎవరైనా ఒక్కటేనని సీఎం రేవంత్ భావించారు. పార్టీ, ప్రభుత్వాన్ని బలహీనపర్చే చర్యలను ఉపేక్షించబోమని అధిష్ఠానం స్పష్టం చేసింది" అని ఆది శ్రీనివాస్ అన్నారు.

## వెలిగొండ, పోలవరం ఎడమ కాలువకు నీటి విడుదలపై వైకాపా దుష్ప్రచారం: సీఎం చంద్రబాబు

మొదటిపేజీ తరువాయి

అమరావతి: జలాశయాల్లో నీళ్లున్నా పంటలకు ఇవ్వట్లేదని గొడ్డలి పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోందని సీఎం చంద్రబాబు దుయ్యబట్టారు. వాటిని సమర్థంగా తిప్పికొట్టడంతోపాటు ప్రజలకు వాస్తవ పరిస్థితులు వివరించాలని మంత్రులను ఆదేశించారు. క్యాబినెట్ భేటీ ముగిసిన అనంతరం మంత్రులతో సీఎం మాట్లాడారు. తాము చేసిన ప్రారంభోత్సవాలను వారి ఘనతగా గొడ్డలి పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫేక్ ప్రచారాలు చేయడంలో వైకాపా ముందుంటుందన్నారు. వెలిగొండ, పోలవరం ఎడమ కాలువకు నీటి విడుదలపై ఆ పార్టీ దుష్ప్రచారం చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం చేసిన ప్రతి మంచీ ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. మంత్రులు నిత్యం ప్రజల్లో ఉంటూ వారికి అన్ని వాస్తవాలు చెప్పాలన్నారు. ఈ సందర్భంగా జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఇంజినీరింగ్ అధికారులను సీఎం అభినందించారు.

రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు సమాచారం అందించాలని సీఎం చంద్రబాబు సూచించారు. ప్రజలకు వాస్తవ పరిస్థితులు వివరించేందుకు అందరినీ భాగస్వాముల్ని చేద్దామన్నారు. నిత్యావసర ధరలు పెరగకుండా చూడాలని మంత్రులకు సీఎం సూచించారు. రైతు బజార్లలో బియ్యం తక్కువ ధరకు ఇస్తున్నట్లు ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల తెలిపారు. మిగిలిన వాటి ధరల నియంత్రణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సీఎం సూచించారు. సీడ్ బాల్స్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను సీఎం ఆదేశించారు.

స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు గెలుపొందేలా ఇన్‌ఛార్జ్ మంత్రులు బాధ్యత తీసుకోవాలన్నారు. జిల్లాల్లో జఠిల సమస్యల పరిష్కారానికి వారిదే బాధ్యతని చెప్పారు. నరసాపురంలో ప్రజల అధీనంలో ఉన్న 6 వేల ఎకరాలకు పట్టాలు లేవని, రెండు నెలల్లో సమస్య పరిష్కరించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి భూములు ఎక్కడున్నాయో గుర్తించి పట్టాలివ్వాలన్నారు. సూర్యఘర్ వినియోగంలో 4వ స్థానంలో ఉన్న ఏపీ మొదటి స్థానానికి రావాలన్నారు. 20 లక్షల కనెక్షన్లయినా వాడుకోవాలన్నారు.

### స్థానిక ఎన్నికలన్నీ ఈ ఏడాదిలోపు పూర్తిచేయాలి

ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలన్నీ ఈ ఏడాదిలోపు పూర్తి చేయాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. వచ్చే ఏడాదికి ఏ ఎన్నికా మిగలకుండా కోర్టు సమస్యలన్నీ పరిష్కరించాలన్నారు. కోర్టు కేసులున్న 23 మున్సిపాలిటీలతో పాటు మిగిలిన 100 చోట్ల కూడా ఎన్నికలు జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

## హైకమాండ్‌ను సీఎం రేవంత్ బ్లాక్‌మెయిల్ చేశారు: కొండా సురేఖ

మొదటిపేజీ తరువాయి



హైదరాబాద్: తనను మంత్రివర్గం నుంచి తొలగించాలంటూ సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ హైకమాండ్‌ను బ్లాక్‌మెయిల్ చేశారని మంత్రి కొండా సురేఖ ఆరోపించారు. ఆమెను బర్తరఫ్ చేయాలంటూ గవర్నర్‌కు సీఎం లేఖ పంపిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కొండా సురేఖ మీడియా సమావేశం నిర్వహించారు.

"నా వివరణ తీసుకోకుండా బర్తరఫ్ నిర్ణయం తీసుకున్నారు. ఉరిశిక్ష పడిన ముద్దాయిని కూడా చివరి కోరిక ఏంటని అడుగుతారు. ఏ తప్పు చేయకపోయినా.. ఎందుకు చేస్తున్నామో చెప్పకుండా నన్ను బర్తరఫ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా. మంత్రి పదవి నుంచి నన్ను తొలగించే ఉద్దేశం కాంగ్రెస్ హైకమాండ్‌కు లేదు. ఆ విషయం నాకు వంద శాతం తెలుసు. కానీ.. సీఎం రేవంత్‌రెడ్డి హైకమాండ్‌ను బ్లాక్‌మెయిల్ చేశారు. ఆమెను మంత్రి పదవి నుంచి తొలగిస్తారా? నన్ను రాజీనామా చేయమంటారా? అని సీఎం బెదిరించారు. నాతో పాటు మాజీ ఓఎస్డీ సుమంత్‌పై కుట్ర చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పాటు ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, సీఎం సోదరులు కొండల్‌రెడ్డి, తిరుపతిరెడ్డి కక్షగట్టారు. నాకు తెలియకుండా సుమంత్‌ను తప్పించారు. పోలీసులపై ఒత్తిడి తెచ్చి ఆయన కుటుంబాన్ని ఇబ్బంది పెడుతున్నారు.

### నేను తప్పు చేయలేదు.. అవమానంగా భావించను

నాపై చర్యలకు సిఫార్సు చేసిన క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి కూడా గతంలో కాంగ్రెస్‌ను తిట్టినవారే. గతంలో రోశయ్య, జైపాల్‌రెడ్డి కూడా ఇందిరాగాంధీని దూషించారు. మంత్రి పదవి నుంచి తొలగించినందుకు నేనేమీ బాధపడట్లేదు. నేను తప్పుచేయలేదు.. బర్తరఫ్‌ను అవమానంగా భావించడం లేదు. మేం ప్రజాబలం ఉన్న నాయకులం.. జనం మా వెంటే ఉంటారు. మంత్రులు, ఎమ్మెల్యేలూ.. మీరు సంతోషంగా ఉన్నారా?గుండెల మీద చేయి వేసుకుని చెప్పాలి. బయటకు వచ్చి మీ బాధలు చెప్పుకోండి. ప్రజాప్రతినిధులకే పనులు జరగని పరిస్థితి నెలకొంది.

### కాంగ్రెస్‌కు రాజీనామా చేసే ఆలోచన లేదు

హామీలు నెరవేర్చకపోవడం వల్ల ప్రజల్లో వ్యతిరేకత వస్తోంది. క్షేత్రస్థాయి పరిస్థితిపై ప్రభుత్వం సర్వే చేయించుకుంటే మంచిది. ఇప్పటికైనా అందరూ బయటకు వచ్చి ధైర్యంగా మాట్లాడాలి. పనులు జరగాలంటే ఎవరి వద్దకు వెళ్లాలో తెలియని స్థితిలో ఎమ్మెల్యేలు ఉన్నారు. ప్రజలకు సేవ, ప్రాంతాన్ని అభివృద్ధి చేయలేకపోతున్నామనే బాధ అందరిలోనూ ఉంది. బర్తరఫ్‌పై పునరాలోచించుకోమని చెప్పను.. పార్టీ తీరు మారాల్సిన అవసరముంది. మళ్లీ కాంగ్రెస్ పార్టీ గెలవాలంటే చాలా మార్పులు చేసుకోవాలి. రేవంత్‌రెడ్డి ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదు. నావైపు ఒక వేలు చూపితే.. రేవంత్ వైపు నాలుగువేళ్లు చూపుతాయి. ప్లాన్-బిపై ఇంకా ఏమీ ఆలోచించుకోలేదు. ఎమ్మెల్యేగా కొనసాగుతా. కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసే ఆలోచన లేదు" అని కొండా సురేఖ అన్నారు.

## అభినందన్ వర్ధమాన్ ఇక కమర్షియల్ పైలట్‌గా..

మొదటిపేజీ తరువాయి

భారత వాయుసేన కు చెందిన ఫైటర్ పైలట్ అభినందన్ వర్ధమాన్ కొత్త కెరీర్‌ను ఎంచుకున్నారు. గోవాకు చెందిన ప్రైవేటు విమానయాన సంస్థలో కమర్షియల్ పైలట్‌గా చేరారు. ఇందుకోసం ఐఏఎఫ్ నుంచి ముందస్తు రిటైర్మెంట్ తీసుకున్నారని జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. 22 ఏళ్ల పాటు వాయుసేనలో వివిధ హోదాల్లో విధులు నిర్వర్తించిన వర్ధమాన్ .. గోవా కేంద్రంగా నడుస్తున్న ఫ్లై91లో పైలట్‌గా చేరారు. ఈ కొత్త ఉద్యోగంలో ఆయన ఆగస్టులోనే చేరినట్లు తెలుస్తోంది. కాగా.. 2019 ఫిబ్రవరి 14న జరిగిన పుల్వామా ఘటన తర్వాత భారత సైన్యం నిర్వహించిన బాలాకోట్ వైమానిక దాడి సమయంలో అభినందన్ వర్ధమాన్ పేరు దేశవ్యాప్తంగా వినిపించింది. బాలాకోట్ దాడి జరిగిన మరుసటిరోజు ఫిబ్రవరి 27న పాక్ వైమానిక దళానికి చెందిన ఎఫ్-16 విమానం భారత్‌పైకి దూసుకురాగా.. నాటి వింగ్ కమాండర్ అభినందన్ మిగ్-21 ఫైటర్ జెట్‌తో దానిని నేలకూల్చారు.

అదే సమయంలో వర్ధమాన్ విమానం కూడా కూలిపోవడంతో పారాచూట్ సాయంతో కిందకు దూకగా ఆయన పాక్ భూభాగంలో పడిపోయారు. దీంతో ఆయన్ను పాక్ జవాన్లు అదుపులోకి తీసుకున్నారు. ఆ సమయంలో అభినందన్‌ను తిరిగి అప్పగించాలని భారత్ నుంచే కాకుండా అంతర్జాతీయస్థాయిలో పాక్‌పై తీవ్ర ఒత్తిడి వచ్చింది. దీంతో దాయాది సైన్యం ఆయనను వాఘా సరిహద్దు వద్ద భారత్‌కు అప్పగించింది. తర్వాత మళ్లీ విధుల్లోకి వచ్చిన వర్ధమాన్.. గ్రూప్ కెప్టెన్ స్థాయికి ఎదిగారు. 2021లో కేంద్ర ప్రభుత్వం ఆయనను 'వీర్ చక్ర' పురస్కారంతో సత్కరించింది.

## నల్సార్ విద్యార్థులకు ఊరట..

మొదటిపేజీ తరువాయి

నల్సార్ యూనివర్సిటీ 2026 బ్యాచ్ న్యాయశాస్త్ర విద్యార్థులెవరినీ న్యాయవాదులుగా నమోదు చేసుకోవద్దంటూ బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఇటీవల ఇచ్చిన ఉత్తర్వులు తీవ్ర వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. ఆ ఆదేశాలను బీసీఐ ఛైర్మన్ మనన్‌కుమార్ మిశ్ర వెంటనే వెనక్కి తీసుకున్నా ప్రయోజనం లేకపోయింది. ఈ అంశాన్ని సీరియస్ తీసుకున్న సుప్రీంకోర్టు .. గురువారం జరిగిన విచారణలో బీసీఐపై ఆగ్రహం వ్యక్తంచేసింది. న్యాయ విద్యార్థులపై క్రమశిక్షణా చర్యలు తీసుకునే చట్టబద్ధ అధికారం లేదని స్పష్టం చేసింది. దీంతో ఆ విద్యార్థులకు భారీ ఊరట లభించినట్లయింది.

నల్సార్ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవానికి భారత ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించేలా నిర్ణయం తీసుకోవద్దని పలువురు విద్యార్థులు లేఖ రాసినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఆ వ్యవహారంపై మూడురోజుల్లోగా పూర్తి నివేదికను సమర్పించాలంటూ మిశ్ర తొలుత వర్సిటీ వీసీని ఆదేశించారు. 2026 బ్యాచ్ న్యాయశాస్త్ర విద్యార్థులెవరినీ న్యాయవాదులుగా నమోదు చేసుకోవద్దంటూ దేశవ్యాప్తంగా ఉన్న బార్ కౌన్సిళ్లకు లేఖ రాశారు. అయితే, దీనిపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. విద్యార్థులతో తనకు జరుగుతున్న సంవాదంలో జోక్యం చేసుకోవడానికి బీసీఐ ఎవరు అని సీజేఐ సైతం ఆగ్రహం వ్యక్తంచేసిన సంగతి తెలిసిందే.

## మంత్రి కొండా సురేఖను బర్తరఫ్ చేయండి..

మొదటిపేజీ తరువాయి

### చిన్నారెడ్డి స్థానంలో గద్వాల్ విజయలక్ష్మి

మరోవైపు ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా ఉన్న చిన్నారెడ్డి స్థానంలో జీహెచ్‌ఎంసీ మాజీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని సీఎం రేవంత్ నియమించారు. రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా నేరెళ్ల శారద, కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్‌పర్సన్‌గా జి.సుధారాణి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

### ఏం జరిగిందంటే..

ఇటీవల పరకాల నియోజకవర్గం గీసుకొండలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని కించపరిచేలా ఆమె వ్యాఖ్యలు చేశారు. దీనిపై వివరణ ఇవ్వాలంటూ కొండా సురేఖకు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ (డీఏసీ) షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఆమె తన వివరణ పంపారు. కుమార్తె వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతమని.. వాటితో తనకు సంబంధం లేదని పేర్కొన్నారు. ఆమె చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయొద్దని కోరారు. మరోవైపు వనపర్తి వ్యవహారంలో ఎమ్మెల్యే మేఘారెడ్డిపై మాజీ మంత్రి చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలు కూడా చర్చనీయాంశమయ్యాయి. వివరణ ఇవ్వాలని ఆయనకూ డీఏసీ షోకాజ్ నోటీసు జారీ చేసింది. సురేఖ, చిన్నారెడ్డి ఇచ్చిన వివరణలను హైకమాండ్‌కు పీసీసీ పంపింది.

కొండా సురేఖతో పాటు చిన్నారెడ్డి వ్యవహారంపై గత రెండు రోజులుగా కాంగ్రెస్ అధిష్ఠానంతో సీఎం రేవంత్, ముఖ్యనేతలు చర్చలు జరిపారు. 2023 డిసెంబరులో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏర్పడిన మంత్రివర్గంలో స్థానం పొందిన సురేఖ వ్యవహారం గతంలో కూడా వివాదాస్పదమైనా, ఈసారి సీఎం రేవంత్‌రెడ్డి చర్యకు గట్టిగా పట్టుబట్టారు. పీసీసీ అధ్యక్షుడు, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి కూడా చర్య తీసుకోవాలనడం, పీసీసీ క్రమశిక్షణ కమిటీ సైతం అదే సిఫార్సు చేసిన నేపథ్యంలో అధిష్ఠానం కూడా వారిద్దరిపై వేటుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది.

## అక్టోబరు నుంచి కొత్త పింఛన్లు: మంత్రి లోకేశ్

మొదటిపేజీ తరువాయి

వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ.. అర్హులకు కొత్త పింఛన్లు అందించాలని మంత్రులకు సూచించారు. కేబినెట్ భేటీకి ముందు మంత్రులతో సమావేశమైన లోకేశ్.. పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు పూర్తిస్థాయిలో సిద్ధమై.. అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. అక్టోబరులోగా స్థానిక ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందని, ఎన్నికలు వాయిదా పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న అంశాలను కూడా త్వరగా పరిష్కరించి.. అన్ని స్థానాల్లో ఎన్నికలు నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. మొదట పురపాలక ఆతర్వాత ఎంపీటీసీ, జడ్పీటీసీ, అనంతరం పంచాయతీ ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. స్థానిక ఎన్నికలు వాయిదా పడితే ఫైనాన్స్ కమిషన్ నిధులు నిలిచిపోయి.. రాష్ట్రానికి నష్టం జరుగుతుందనే దురుద్దేశంతో ప్రతిపక్షం కుట్రలు చేస్తోందని ఆరోపించారు. విద్యాశాఖను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న కుట్రలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. మాట వినని అధికారులు, శాఖకు లేదా మంత్రికి చెడ్డపేరు తెచ్చేలా వ్యవహరించే అధికారుల విషయంలో ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుందామని తెలిపారు. ఇటీవల కొన్ని సమస్యలు ఒకరిద్దరు అధికారుల పనితీరుతోనే ఉత్పన్నమయ్యాయని అభిప్రాయపడ్డారు. వైద్య రంగంలో చిన్న పొరపాటు జరిగినా సోషల్ మీడియాలో.. ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని ట్రోలింగ్ జరుగుతోందని, ఇలాంటి అంశాలపై కూడా మంత్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. (సెప్టెంబరు 9న) అధినేత చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయించి, అన్యాయంగా నిర్బంధించి మూడేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించాలని లోకేశ్ సూచించారు. నాటి దుశ్చర్య నుంచి ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ.. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న తీరును ప్రజలకు గుర్తు చేసేలా కార్యక్రమం ఉండాలన్నారు. ఎల్‌నినో ప్రభావం వల్ల నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున.. ముందస్తు ప్రణాళికలు, పొదుపు చర్యలతో సమస్యను అధిగమిద్దామని లోకేశ్ సూచించారు.

# రాజన్న సిరిసిల్ల జిల్లాలో కిరాతక భర్త..
# కట్టుకున్న భార్యను నడిరోడ్డుపైనే దారుణ హత్య..

ఎల్లారెడ్డిపేట మండలం / సెప్టెంబర్ 03 ప్రజాదివాస్

ఆరు నెలలుగా పుట్టింట్లో ఉంటున్న భార్యపై కక్ష పెంచుకున్న ఓ భర్త నడిరోడ్డుపై కత్తితో దాడి చేసి హతమార్చిన దారుణ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామ శివారులో చోటుచేసుకుంది. భార్యను కాపాడేందుకు అడ్డువచ్చిన అత్తపైనా నిందితుడు కత్తితో దాడి చేయడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. పదిర గ్రామానికి చెందిన జ్యోతికి ముస్తాబాద్ మండలం చీకోడుకు చెందిన సురేష్‌తో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు సిద్ధు, బన్నీ, కుమార్తె దీక్ష ఉన్నారు. కొంతకాలంగా బంగారం, వెండి అమ్మి డబ్బులు తీసుకురావాలంటూ సురేష్ భార్య జ్యోతితో గొడవపడుతున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. గతంలోనూ జ్యోతిని హత్య చేసేందుకు ప్రయత్నించినట్లు వారు ఆరోపించారు. భర్త వేధింపులు భరించలేక జ్యోతి ఆరు నెలల క్రితం పుట్టింటికి వచ్చి తల్లి ఎల్లవ్వ వద్ద ఉంటోంది.అయితే జ్యోతి తన మాట వినడం లేదన్న కక్షతో సురేష్ ఆమెపై ఆగ్రహం పెంచుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ క్రమంలో జ్యోతి తన తల్లి ఎల్లవ్వతో కలిసి ఆసుపత్రికి వెళ్లి తిరిగి వస్తున్న విషయం తెలుసుకున్న సురేష్.. పదిర గ్రామ శివారులో కారులో కాపుకాసినట్లు తెలుస్తోంది. రాత్రి సమయంలో జ్యోతి, ఎల్లవ్వ బస్సు దిగి ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా కారులో వచ్చిన సురేష్ వెంట తెచ్చుకున్న కత్తితో జ్యోతిపై విచక్షణారహితంగా దాడి చేశాడు. కూతురిని కాపాడేందుకు ఎల్లవ్వ అడ్డుకునే ప్రయత్నం చేయగా ఆమెపైనా కత్తితో దాడి చేశాడు. జ్యోతి పొట్ట, ఛాతి, చేతులపై తీవ్రంగా కత్తిపోట్లు పడటంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందింది. ఎల్లవ్వ కాలు, పొట్ట భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. తల్లీకూతుళ్ల కేకలు విన్న స్థానికులు వెంటనే అక్కడికి చేరుకోవడంతో సురేష్ కారులో అక్కడి నుంచి పారిపోయేందుకు ప్రయత్నించాడు. స్థానికులు బండరాళ్లతో కారును అడ్డుకునే ప్రయత్నం చేసినప్పటికీ తప్పించుకుని పారిపోయాడు. అనంతరం సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి హత్య చేసినట్లు చెప్పి లొంగిపోయినట్లు మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన



ఎల్లవ్వను తొలుత సిరిసిల్ల జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై సమాచారం అందుకున్న డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ వెంకటేష్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఘటనకు సంబంధించిన వివరాలను సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడికానున్నాయి.

# వివేకానంద విద్యానికేతన్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా

- గోపికలు, కృష్ణుల వేషధారణలతో విద్యార్థుల సందడి
- ఉట్టి కొట్టు, కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించిన చిన్నారులు విజేతలకు పాఠశాల యాజమాన్యం బహుమతుల ప్రదానం

రాజన్న సిరిసిల్ల జిల్లా/ సెప్టెంబర్ 3 ప్రజాదివాస్




స్థానిక అశోక్‌నగర్‌లోని వివేకానంద విద్యానికేతన్ హై స్కూల్లో గురువారం శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ముందస్తు “ఉట్టి కొట్టు” కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిం ఈ సందర్భంగా సుమారు 100 మంది విద్యార్థులు గోపికలుగా, మరో 100 మంది విద్యార్థులు శ్రీకృష్ణుని వేషధారణలో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కోలాటాలు, ఉట్టి కొట్టు పోటీలు, భక్తి గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో పాఠశాల ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.ఉట్టి కొట్టు కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం బహుమతులు అందజేసి అభినందించింది. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ దిడ్డి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ బుచ్చారావు, మహేందర్ రెడ్డితో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# చెరువుల సంరక్షణకు ప్రత్యేక కార్యాచరణ

- 164 వెట్‌ల్యాండ్స్ అభివృద్ధికి శాఖల సమన్వయంతో చర్యలు
- హద్దులు, ఎఫ్‌టీఎల్ నమోదు పూర్తి చేయాలని కలెక్టర్ గరిమ అగర్వాల్ ఆదేశం

రాజన్న సిరిసిల్ల జిల్లా / సెప్టెంబర్ 3 ప్రజాదివాస్

జిల్లాలో గుర్తించిన చెరువులు (వెట్‌ల్యాండ్స్) సంరక్షణ, అభివృద్ధికి సమగ్ర కార్యాచరణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. అటవీ, రెవెన్యూ, నీటి పారుదల, మత్స్య, వ్యవసాయ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖల అధికారులతో గురువారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు.

జిల్లాలో మొత్తం 164 చెరువులను వెట్‌ల్యాండ్స్‌గా గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. ఆయా చెరువుల హద్దులు, పూర్తి విస్తీర్ణం, ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంక్ లెవల్) వివరాలను సంబంధిత శాఖల సమన్వయంతో సర్వే చేసి



మ్యాపింగ్ పూర్తి చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. అభివృద్ధి ప్రతిపాదనలను అటవీ శాఖకు పంపించి, చెరువుల అభివృద్ధి, మరమ్మత్తు పనులను చేపట్టాలని ఆదేశించారు.వెట్‌ల్యాండ్స్ భూగర్భ జలాల పెరుగుదలకు, పర్యావరణ పరిరక్షణకు కీలకమని పేర్కొన్న కలెక్టర్, వీటి అభివృద్ధితో స్థానిక, వలస పక్షులు, జంతువులకు అనుకూల వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు. పర్యాటక రంగ అభివృద్ధికి కూడా ఇవి దోహదపడతాయని చెప్పారు. భవిష్యత్తులో చెరువులను ఆక్రమణల నుంచి రక్షించడంతో పాటు మొక్కల పెంపకం, చేపల పెంపకం, పర్యాటక అభివృద్ధికి అవకాశాలు మెరుగుపడతాయని వివరించారు.

### రీ-సర్వేలో అన్ని శాఖలు భాగస్వాములు కావాలి

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూముల రీ-సర్వే కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు చురుకుగా పాల్గొనాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. అటవీ, నీటి పారుదల, ఇతర ప్రభుత్వ శాఖలకు చెందిన భూముల వివరాలను సర్వే అధికారులకు అందజేసి రికార్డులను పక్కాగా నమోదు చేయాలని సూచించారు. ప్రస్తుతం సర్వే జరుగుతున్న గ్రామాల్లో రైతులు పాల్గొనేలా వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.సమావేశంలో ఆర్డీఓలు శ్రీధర్ బాబు, కేవీస్‌బీ కుమారి, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా మత్స్యశాఖ అధికారి సౌజన్య, నీటి పారుదల శాఖ అధికారి ప్రశాంత్ కుమార్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సూరమ్మ ప్రాజెక్టుపై ప్రభుత్వ విప్‌కు సవాల్: బిఆర్ఎస్ నియోజకవర్గ ఇన్ ఛార్జి చల్మెడ

వేములవాడ / సెప్టెంబర్ 03 ప్రజాదివాస్



సూరమ్మ ప్రాజెక్టు ద్వారా ఆయకట్టుకు సాగునీరు అందించే అంశంపై ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు బిఆర్ఎస్ నియోజకవర్గ ఇన్ ఛార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు సవాల్ విసిరారు. సూరమ్మ ప్రాజెక్టు వద్ద కొబ్బరికాయ కొట్టిన ఆది శ్రీనివాస్.. 43,100 ఎకరాలకు ఎప్పుడు నీళ్లు ఇస్తారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. తన పదవీ కాలంలో సూరమ్మ ప్రాజెక్టు లెఫ్ట్, రైట్ కెనాల ద్వారా రైతులకు సాగునీరు అందిస్తే తాను రాబోయే ఎన్నికల పోటీ నుంచి తప్పుకుంటానని, అందించలేకపోతే ఆది శ్రీనివాస్ పోటీ నుంచి తప్పుకోవాలని లక్ష్మీనరసింహారావు సవాల్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే రైతులను మోసం చేస్తున్నారని విమర్శించారు. అధికారంలో ఉండి కూడా నిరసనలు, ర్యాలీలు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను తిట్టడమే తప్ప, సాధించిన అభివృద్ధి ఏమీ లేదని, ముందుగా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

# బిజెపి రాష్ట్ర కార్యాలయంపై దాడికి నిరసనగా ఇల్లంతకుంటలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం

- నాంపల్లి బిజెపి ఆఫీస్‌పై కాంగ్రెస్ దాడి అప్రజాస్వామికం: బిజెపి ఎస్సీ మోర్చా నాయకుడు మామిడి హరీష్

ఇల్లంతకుంట మండలం / సెప్టెంబర్ 03 ప్రజాదివాస్

భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తల దాడికి నిరసనగా, అలాగే సమాజ సేవకుడు సంత్ రవిదాస్ చిత్రపటానికి నల్ల రంగు పులిమి అవమానించిన ఘటనను ఖండిస్తూ గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలో బిజెపి శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. స్థానిక బస్టాండ్ ఆవరణలో బిజెపి జిల్లా ఎస్సీ మోర్చా నాయకుడు మామిడి హరీష్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున చేరుకుని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా బిజెపి జిల్లా ఎస్సీ మోర్చా నాయకుడు మామిడి హరీష్ మాట్లాడుతూ.. నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ నాయకులు దాడికి పాల్పడటం అత్యంత అప్రజాస్వామికమని, ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. రాజకీయంగా బిజెపిని ఎదుర్కొనే ధైర్యం లేకనే ఇలాంటి దాడులకు దిగుతున్నారని విమర్శించారు. అనంతరం బిజెపి మండల అధ్యక్షుడు భూమళ్ళ అనిల్ కుమార్ మాట్లాడుతూ.. మహనీయుడైన సంత్ రవిదాస్ చిత్రపటానికి నల్ల రంగు పూసి అవమానించడం కాంగ్రెస్ అరాచక పాలనకు అద్దం పడుతోందన్నారు. ప్రజాదరణ కోల్పోతున్న కాంగ్రెస్ ప్రభుత్వం తమ వెయ్యి రోజుల వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే ఈ దాడులకు తెగబడిందని ఆరోపించారు. రాష్ట్ర కార్యాలయంపై దాడి చేసిన కాంగ్రెస్ గుండాలపై వెంటనే కేసులు నమోదు



చేసి, వారిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మొదలుపెట్టిన ఈ దాడుల సంస్కృతికి బిజెపి కార్యకర్తలు తగిన విధంగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మాజీ మండల అధ్యక్షుడు నాగసముద్రాల సంతోష్, అసెంబ్లీ కో-కన్వీనర్ బత్తిని స్వామి, మండల ప్రధాన కార్యదర్శి కరికే నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# కేసుల పరిష్కారానికి రాజీ మార్గమే రాజ మార్గం: జిల్లా ప్రధాన న్యాయమూర్తి

- సిరిసిల్ల, వేములవాడ బార్ అసోసియేషన్లతో సమన్వయ సమావేశం
- చెక్ బౌన్స్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచన

రాజన్న సిరిసిల్ల జిల్లా / సెప్టెంబర్ 03 ప్రజాదివాస్




కోర్టు కేసుల్లో ఇరుపక్షాలు రాజీ చేసుకోవడం వల్ల సమయం, డబ్బు ఆదా అవుతాయని, అందుకే రాజీ మార్గమే రాజ మార్గమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షురాలు పి.నీరజ తెలిపారు. గురువారం జిల్లా కోర్టు సముదాయంలో సిరిసిల్ల, వేములవాడ బార్ అసోసియేషన్ న్యాయవాదులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ.. కేసులు పరస్పర అంగీకారంతో పరిష్కారమవడం వల్ల ప్రజలు దీర్ఘకాలిక న్యాయ ప్రక్రియల నుంచి విముక్తి పొందుతారని చెప్పారు. ముఖ్యంగా ఎన్ఐ యాక్ట్ (చెక్ బౌన్స్) కేసుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. లోక్ అదాలత్‌లో మరిన్ని కేసుల పరిష్కారానికి పూర్తి సహకారం అందిస్తామని బార్ అసోసియేషన్ సభ్యులు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో పోక్సో కోర్టు న్యాయమూర్తి రాధిక జైస్వాల్, సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌ఛార్జి కార్యదర్శి పి.లక్ష్మణాచారి, సిరిసిల్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఆవునూరి రమాకాంతరావు, ప్రధాన కార్యదర్శి సిహెచ్.వెంకయ్య, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

# సబ్ రిజిస్టర్ కార్యాలయం ప్రారంభించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**- మార్కెట్ యార్డు నూతన భవనంలోకి వేములవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం**

వేములవాడ / సెప్టెంబర్ 03 ప్రజాదివాస్



వేములవాడ పట్టణంలో ఇప్పటివరకు అద్దె భవనంలో కొనసాగుతున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మార్కెట్ యార్డు ప్రాంగణంలోని నూతన భవనంలోకి మార్చారు. ఈ నూతన కార్యాలయ భవనాన్ని గురువారం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ప్రజలకు మెరుగైన, వేగవంతమైన సేవలు అందించే లక్ష్యంతో నూతన కార్యాలయంలో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించారు. నూతన భవనంలోకి కార్యాలయం మారడంతో రిజిస్ట్రేషన్ సేవల కోసం వచ్చే వినియోగదారులకు, ప్రజలకు సౌకర్యవంతంగా ఉండనుంది. సకల సదుపాయాలతో నూతన భవనం అందుబాటులోకి రావడంపై స్థానిక ప్రజలు తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ పుల్కం రాజు, ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అధికారులు పాల్గొన్నారు.

# ముదిరాజుల హక్కుల కోసం గళమెత్తిన సిరిసిల్ల రౌండ్ టేబుల్

**- ఐదు కీలక తీర్మానాలకు ఆమోదం.. బీసీ-ఏలో చేర్చాలని డిమాండ్**

**- 50 ఏళ్లు దాటిన ముదిరాజులందరికీ పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి**

వేములవాడ / సెప్టెంబర్ 3 ప్రజాదివాస్



రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ అర్బన్ మండలం అగ్రహారంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో గురువారం జిల్లా ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ముదిరాజ్ సమాజానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించి ఐదు ప్రధాన తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. జిల్లాలోని ముదిరాజ్ సంఘాల ప్రతినిధులు, నాయకులు, మేధావులు, యువజన ప్రతినిధులు పాల్గొన్న ఈ సమావేశంలో ముదిరాజుల సామాజిక, ఆర్థిక, రాజకీయ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం బీసీ-డీ కేటగిరీలో ఉన్న ముదిరాజులను బీసీ-ఏ వర్గంలోకి మార్చాలని ప్రధాన డిమాండ్‌గా తీర్మానించారు. దీనివల్ల విద్య, ఉద్యోగ రంగాల్లో ముదిరాజ్ యువతకు మెరుగైన అవకాశాలు లభిస్తాయని అభిప్రాయపడ్డారు. అదేవిధంగా 50 ఏళ్లు దాటిన ప్రతి ముదిరాజ్‌కు ప్రభుత్వం పెన్షన్ మంజూరు చేయాలని, రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ముదిరాజ్ సత్రం నిర్మాణం కోసం కనీసం ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించాలని కోరారు. జనాభా ప్రాతిపదికన రాజకీయ పదవులు, ఎన్నికల్లో సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ముదిరాజ్ కార్పొరేషన్‌కు తగిన బడ్జెట్ ధులు విడుదల చేసి, పేద కుటుంబాలకు సంక్షేమ పథకాలు, స్వయం ఉపాధి అవకాశాలు అందేలా చర్యలు చేపట్టాలని సమావేశం ప్రభుత్వాన్ని కోరింది. ముదిరాజుల హక్కులు, అభివృద్ధి కోసం భవిష్యత్తులో ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామని సమావేశంలో పాల్గొన్న నాయకులు స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ముదిరాజ్ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బాలికల పాఠశాలలో సైన్స్ ల్యాబ్, గ్రంథాలయం ప్రారంభించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ / సెప్టెంబర్ 03 ప్రజాదివాస్




వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినుల సౌకర్యార్థం నూతనంగా ఏర్పాటు చేసిన సైన్స్ ల్యాబ్, గ్రంథాలయాన్ని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థినులకు కేవలం పుస్తక పాఠాలే కాకుండా ప్రయోగాత్మక పరిజ్ఞానాన్ని అందించేందుకు సైన్స్ ల్యాబ్, పఠనాసక్తిని పెంపొందించేందుకు గ్రంథాలయం ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. విద్యార్థినులు నాణ్యమైన విద్యతో పాటు శాస్త్రీయ దృక్పథాన్ని అలవరచుకోవాలని సూచించారు. పాఠశాల సమగ్ర అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు తమ వంతు పూర్తి సహకారాన్ని నిరంతరం అందిస్తామని ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# విజ్ఞానం పెంపొందించడం కోసం ఐదు గ్రామాల్లో గ్రంథాలయాలు ఏర్పాటు

**- విపంచి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పుస్తకాల విరాళం**

**- ఒక్కో గ్రామానికి రూ.10 వేల పుస్తకాలు పంపిణీ**

**- కార్యక్రమానికి ఐదు గ్రామాల సర్పంచ్ లు హాజరు**

ముస్తాబాద్,/సెప్టెంబర్ 03 ప్రజా దివాస్



విపంచి ఫౌండేషన్ హైదరాబాద్ వారు రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలోని ఐదు గ్రామాల్లో గ్రంథాలయాల ఏర్పాటుకు పుస్తకాలను విరాళంగా అందించారు. గురువారం హైదరాబాద్‌లోని శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని తెర్లుమద్ది, బందనకల్,మద్దికుంట, రామలక్ష్మణపల్లి,చీకోడు గ్రామాల్లో గ్రంథాలయాల ఏర్పాటుకు సహకరిస్తూ ఒక్కో గ్రామానికి రూ.10 వేల విలువైన పుస్తకాలను విపంచి ఫౌండేషన్ అందించిందడం జరిగిందని సర్పంచుల ఫోరంమండల అధ్యక్షుడు చిగురు నరేష్ తెలియజేశారు. ఈ సందర్భంగా విపంచి ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు, యువతలో పఠనాసక్తిని పెంపొందించడంతో పాటు విజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో గ్రంథాలయాల ఏర్పాటుకు సహకరిస్తున్నట్లు తెలిపారు. ఉదయం,సాయంత్రంసమయంలో గ్రంథాలయానికి వెళ్లి చదవడం అలవర్చుకోవాలని సూచించారు. పుస్తక పఠనం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు బైతి దుర్గమ్మ, దొనుకుల రాజమల్లవ్వ, కోటగిరి ఎల్లవ్వ, బొమ్మెన అంజనేయులు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. గ్రామాల్లో గ్రంథాలయాల ఏర్పాటుకు పుస్తకాలను విరాళంగా అందించిన విపంచి ఫౌండేషన్‌ను పలు గ్రామాల సర్పంచులు గ్రామ ప్రజలు అభినందించారు.

# కొండాపూర్‌కు పునఃప్రారంభమైన బస్సు సర్వీసు

**- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చొరవతో తీరిన ప్రయాణికుల కష్టాలు సర్పంచ్ గౌతమి ప్రశాంత్ విజ్ఞప్తితో స్పందించిన ఆర్టీసీ అధికారులు**

కోనరావుపేట మండలం / సెప్టెంబర్ 3 ప్రజాదివాస్



కోనరావుపేట మండలం కొండాపూర్ గ్రామానికి నిలిచిపోయిన బస్సు సర్వీసు గురువారం నుంచి పునఃప్రారంభమైంది. గత కొన్ని రోజులుగా గ్రామానికి బస్సు రాకపోవడంతో గ్రామస్తులు, విద్యార్థులు రవాణా సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న రవాణా సమస్యను గుర్తించిన సర్పంచ్ వంకాయల గౌతమి ప్రశాంత్ సమస్యను ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే సిరిసిల్ల డిపో మేనేజర్ ప్రకాష్‌రావుతో మాట్లాడి కొండాపూర్‌కు బస్సు సర్వీసును వెంటనే పునరుద్ధరించాలని కోరారు. సమస్యపై స్పందించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చొరవతో ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టి గురువారం నుంచి కొండాపూర్‌కు బస్సు రాకపోకలను పునరుద్ధరించారు. దీంతో గ్రామస్తులు, విద్యార్థులు, ప్రయాణికులకు రవాణా సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. బస్సు సర్వీసు తిరిగి ప్రారంభం కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గౌతమి ప్రశాంత్ మాట్లాడుతూ.. కొండాపూర్ ప్రజల రవాణా కష్టాలను గుర్తించి ప్రత్యేక శ్రద్ధతో బస్సు సర్వీసును పునఃప్రారంభించేందుకు చొరవ చూపిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు గ్రామ ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమస్య పరిష్కారానికి సహకరించిన సిరిసిల్ల డిపో డీఎం ప్రకాష్‌రావుకు, కోనరావుపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడికి కూడా గ్రామ ప్రజల తరఫున ధన్యవాదాలు తెలిపారు. గ్రామ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని, కొండాపూర్ అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తామని సర్పంచ్ గౌతమి ప్రశాంత్ పేర్కొన్నారు.

# భార్య మృతితో మనస్తాపం.. చెట్టుకు ఉరేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

**- కోనరావుపేట మండలంలో విషాదం**

కోనరావుపేట మండలం / సెప్టెంబర్ 03 ప్రజాదివాస్



కోనరావుపేట మండలం రామన్నపేట గ్రామానికి చెందిన నేతుల రాజయ్య (70) ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆరు నెలల క్రితం ఆయన భార్య మృతి చెందడంతో అప్పటి నుంచి రాజయ్య తీవ్ర మనస్తాపానికి గురైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకుని రాజయ్య మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ఎల్లారెడ్డిపేటలో యూరియా కొరత.. PACS ఎదుట రైతుల ఆందోళన

**- ఆన్‌లైన్ బుకింగ్‌తో ఇబ్బందులు.. సకాలంలో ఎరువులు అందించాలని డిమాండ్**




ఎల్లారెడ్డిపేట మండలం / సెప్టెంబర్ 03 ప్రజాదివాస్

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో యూరియా కొరతను నిరసిస్తూ బిఆర్ఎస్ నాయకులు, రైతులు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (ప్యాక్స్) కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఎరువుల బస్తాల కోసం తెల్లవారుజాము నుంచే క్యూలో నిల్చోవాల్సి వస్తోందని, కొన్నిచోట్ల చెప్పులను వరుసలో పెట్టి గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు తెలిపారు. అలాగే యూరియా పంపిణీకి అమలు చేస్తున్న స్మార్ట్‌ఫోన్ ఆన్‌లైన్ బుకింగ్ విధానంపై రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. స్మార్ట్‌ఫోన్ వాడకం సరిగా తెలియని సాధారణ రైతులకు ఈ విధానం వల్ల ఎరువులు పొందడం కష్టంగా మారిందని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి ఆన్‌లైన్ నిబంధనలను సడలించాలని, కొరత లేకుండా ప్రతి ఒక్క రైతుకూ సకాలంలో ఎరువులు అందేలా తక్షణ చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

# రైతు వేదికల ముందు బిఆర్ఎస్ నాయకులు నిరసన కార్యక్రమాలు

- యూరియా కోసం రైతన్నలు నిరీక్షణ
- కర్షక లోకం సమరభేరి మోగించింది






ముస్తాబాద్ / సెప్టెంబర్ 3 ప్రజా దివాస్

తెలంగాణలో రైతు ఆగ్రహం కట్టలు తెంచుకుంది! ఆరు గ్యారంటీలు.. 420 హామీలు ఏమయ్యాయంటూ రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై కర్షక లోకం సమరభేరి మోగించింది.రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో గల రైతు వేదిక వద్ద బి ఆర్ ఎస్ నాయకులు, రైతులు భారీ ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టి అబద్దాల కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తుంగలో తొక్కాలని రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడేది ఎలా..? మళ్లీ కెసిఆర్ ప్రభుత్వం రావాలని రైతులు నాయకులు నినాదాలు చేశారు ముస్తాబాద్ మండలంలో కేటీఆర్ ఆదేశాల మేరకు మండల బి ఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బొంపల్లి సురేందర్రావు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు అనంతరం పలువురు నేతలు మాట్లాడుతూ యూరియా కష్టాలు తీవ్రరూపం దాల్చాయి. యూరియా బస్తాల కోసం తెల్లవారు జాము నుంచే రైతులు చెప్పులను లైన్లో పెట్టాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. స్మార్ట్‌ఫోన్ ఆన్‌లైన్ బుకింగ్ విధానంపై రైతులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు స్మార్ట్‌ఫోన్ వాడకం రాని నిరుపేద రైతులు యూరియాను ఎక్కడ బుక్ చేసుకోవాలని ప్రశ్నించారు. రైతే ఏడ్చిన రాజ్యం.. ఎద్దేడ్చిన వ్యవసాయం బాగుపడినట్లు చరిత్రలోనే లేదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరంకుశ పాలనకు చరమగీతం పాడే సమయం ఆసన్నమైందని మండిపడ్డారు.ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, యూరియా కొరతను తీర్చి ప్రతీ ఒక్క రైతుకు సకాలంలో ఎరువులు అందేలా చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి మాజీ రైతుబంధు అధ్యక్షులు కల్వకుంట్ల గోపాలరావు మాజీ జెడ్పీటిసి జనగామ శరత్ రావు మాజీ ఎంపీపీ అక్కరాజు శ్రీనివాస్ బి ఆర్ ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఎద్దండి నరసింహారెడ్డి మాజీ సెస్ డైరెక్టర్ విజయ రామారావు బత్తుల అంజయ్య కొమ్ము బాలయ్య నవాబ్ శీలం స్వామి మనోహర్ కొండ శ్రీనివాస్ గౌడ్ కోడె శ్రీనివాస్ రాచమడుగు సంతోష్ రావు కొమ్మెట రాజమల్లు కొమ్మెట రాజు రేసు రఘు పలువురు టిఆర్ఎస్ పార్టీ నాయకులు రైతులు తదితరులు పాల్గొన్నారు

# రైతులను మోసం చేస్తున్న రేవంత్ రెడ్డి గద్దె దిగాలి...

వీర్నపల్లి సెప్టెంబర్ 3 ప్రజా దివాస



బి ఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సిరిసిల్ల శాసనసభ్యులు కేటీ రామారావు పిలుపు మేరకు వీర్నపల్లి మండల కేంద్రంలో టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు గుజ్జల రాజిరెడ్డి ఆధ్వర్యంలో మూడవ రోజు నిరసన కార్యక్రమమును రైతులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 420 హామీలు ఇచ్చి అనేక అబద్దాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి ప్రజలను మోసం చేస్తూ రైతాంగాన్నివ్యవసాయం విధ్వంసం చేశారన్నారు. 6 గ్యారంటీలను తుంగలో తొక్కి రైతాంగ నీటిపారుదల రంగం పై వివక్షత చూపారన్నారూ. ఇవే కాకుండా 24 గంటల కరెంటును ఇవ్వక ..వేసిన పంటకు యూరియాను యాపుల పేర్లతో రైతులను ఆగం చేస్తున్నాడని అన్నారు .రైతాంగమును ఆదుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే రాజీనామా చేసి రైతులకు క్షమాపణ చెప్పాలని అన్నారు. రైతాంగం కు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని, రైతులకు కావలసిన రైతు భరోసాను, రైతు బీమా ను రైతులకు అందించాలని డిమాండ్ చేశారు ,లేనియెడల రైతులతో కలిసి మరో ఉద్యమంతో ముందుకొస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో రైతులు, బిఆర్ఎస్ పార్టీ మండల ప్రజా ప్రతినిధులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ రాజీనామా చేయాలంటూ కాంగ్రెస్ భారీ ర్యాలీ

- వేములవాడలో ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం
- బీఆర్ఎస్ వైఫల్యాలు -కాంగ్రెస్ సంక్షేమ పథకాలపై ఫ్లెక్సీల ప్రదర్శన



వేములవాడ / సెప్టెంబర్ 3 ప్రజాదివాస్

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గ కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ అసెంబ్లీకి హాజరై ప్రజా సమస్యలపై మాట్లాడడం లేదని ఆరోపిస్తూ ఆయన వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా సుమారు 500 మీటర్ల మేర గత ఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో జరిగిన వైఫల్యాలు, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ ఫ్లెక్సీలతో ర్యాలీ చేపట్టారు. కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని నినాదాలు చేశారు.అనంతరం జరిగిన సభలో ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని ఆరోపించారు. కల్వకుంట్ల కుటుంబం రాష్ట్ర ప్రజలకు బాకీ ఉందని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు.ప్రజా ప్రభుత్వానికి వస్తున్న ఆదరణను చూసి బీఆర్ఎస్ నాయకులు తట్టుకోలేక విమర్శలు చేస్తున్నారని అన్నారు. అసెంబ్లీకి హాజరుకాని కేసీఆర్ ప్రతిపక్ష నాయకుడిగా విఫలమయ్యారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఇలాంటి కార్యక్రమాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు.ర్యాలీలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సిరిసిల్లలో కాటన్ చీరల కార్మికుల సమ్మె 4వ రోజుకు చేరిక

- కూలీ పెంచకపోతే యజమానుల ఇళ్ల ముట్టడి: సీఐటీయూ హెచ్చరిక
- ఒప్పందం ముగిసి రెండేళ్లయినా పెరగని వేతనాలు: సిరిసిల్లలో నేతన్నల భారీ ర్యాలీ

రాజన్న సిరిసిల్ల జిల్లా / సెప్టెంబర్ 03 ప్రజాదివాస్




సిరిసిల్లలో కాటన్ చీరల కార్మికులు, ఆసాములు చేపట్టిన సమ్మె గురువారం నాటికి 4వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కాలేజీ గ్రౌండ్ నుంచి నేతన్న విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించిన కార్మికులు, ఆసాములు విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ మాట్లాడారు. కాటన్ చీరల ఉత్పత్తి యజమానులతో చేసుకున్న ఒప్పంద గడువు ముగిసి రెండేళ్లు దాటినా కూలీ పెంచకుండా శ్రమ దోపిడీకి గురిచేస్తున్నారని ఆరోపించారు. కార్మికులు, ఆసాములు తమ శ్రమకు తగిన ఫలితాన్ని మాత్రమే...

# చందుర్తి పీఎం శ్రీ పాఠశాలలో ఘనంగా ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు

- కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారుల సందడి ఉట్టికొట్టే కార్యక్రమంతో ఆకట్టుకున్న విద్యార్థులు

చందుర్తి / సెప్టెంబర్ 03 ప్రజా దివాస్

చందుర్తి మండల కేంద్రంలోని పీఎం శ్రీ చందుర్తి ప్రాథమిక పాఠశాలలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కృష్ణాష్టమిని పురస్కరించుకుని పాఠశాలలో చిన్నారులు చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణలో ముస్తాబై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

ఈ సందర్భంగా తల్లిదండ్రుల ఆధ్వర్యంలో విద్యార్థులతో ఉట్టికొట్టే కార్యక్రమాన్ని ఉత్సాహభరితంగా నిర్వహించారు. చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణలో పాల్గొని పాఠశాల ప్రాంగణంలో పండుగ వాతావరణాన్ని నెలకొల్పారు. విద్యార్థుల ఉత్సాహం, సంప్రదాయ వేషధారణలు తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను విశేషంగా ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమానికి చందుర్తి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీ తక్కళ్ల లచ్చిరెడ్డి గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు, తల్లిదండ్రులకు కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలియజేశారు. శ్రీకృష్ణుడి జన్మ విశిష్టతను, కృష్ణాష్టమి పండుగ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించి, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను చిన్నారులకు పరిచయం చేయడంలో ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు.పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి వేముల సుజాత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలు విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల



సమన్వయంతో విజయవంతంగా జరిగాయి.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రాచకొండ ప్రసాద్, రాకం రవికుమార్, కాపిల్ల నరేష్, మమత, స్వప్న జ్యోతి, విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చిన్నారుల కృష్ణాష్టమి వేడుకలతో పాఠశాల ప్రాంగణమంతా భక్తి, ఆనందం, సందడితో కళకళలాడింది.

# నేరెళ్ల బడి పిల్లలకు ఉచిత స్టీల్ వాటర్ బాటిళ్లు

- తల్లి జ్ఞాపకార్థం విద్యార్థులకు సేవా కార్యక్రమం
- ప్లాస్టిక్ రహిత గ్రామ నిర్మాణానికి సహకరించాలి: సర్పంచ్ పొన్నం లచ్చయ్య

తంగళ్లపల్లి మండలం / సెప్టెంబర్ 3 ప్రజాదివాస్



తంగళ్లపల్లి మండలం నేరెళ్ల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు గురువారం ఉచితంగా స్టీల్ వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన పసుల లక్ష్మణ్ తన తల్లి ఎల్లవ్వ జ్ఞాపకార్థం పాఠశాలలోని విద్యార్థులందరికీ వాటర్ బాటిళ్లను అందజేసి సేవాభావాన్ని చాటుకున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిగా హాజరైన గ్రామ సర్పంచ్ పొన్నం లచ్చయ్య విద్యార్థులకు బాటిళ్లను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ, తల్లి జ్ఞాపకార్థం పిల్లలకు ఉపయోగపడే విధంగా బాటిళ్ల పంపిణీ చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. గ్రామాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు.పసుల లక్ష్మణ్ చేపట్టిన ఈ కార్యక్రమం ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందని సర్పంచ్ అన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా స్టీల్ వాటర్ బాటిళ్ల వినియోగం ఎంతో ఉపయోగకరమని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం సిరిసిల్ల సాగర్, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం దుబ్బాక ప్రభాకర్, ఉపాధ్యాయులు గుండెల్లి నర్మద, కావ్య, హఫీజ్, ఉమ, అంగన్‌వాడీ టీచర్ పద్మ, వార్డు సభ్యులు ఎల్లం, గోపాల్, మహిళా సంఘం అధ్యక్షురాలు ఊహ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# రైతులను మోసం చేస్తున్న రేవంత్ రెడ్డి గద్దె దిగాలి...



బి ఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సిరిసిల్ల శాసనసభ్యులు కేటీ రామారావు పిలుపు మేరకు వీర్నపల్లి మండల కేంద్రంలో టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు గుజ్జల రాజిరెడ్డి ఆధ్వర్యంలో మూడవ రోజు నిరసన కార్యక్రమమును రైతులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 420 హామీలు ఇచ్చి అనేక అబద్దాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి ప్రజలను మోసం చేస్తూ రైతాంగాన్నివ్యవసాయం విధ్వంసం చేశారన్నారు. 6 గ్యారంటీలను తుంగలో తొక్కి రైతాంగ నీటిపారుదల రంగం పై వివక్షత చూపారన్నారూ. ఇవే కాకుండా 24 గంటల కరెంటును ఇవ్వక ..వేసిన పంటకు యూరియాను యాపుల పేర్లతో రైతులను ఆగం చేస్తున్నాడని అన్నారు .రైతాంగమును ఆదుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే రాజీనామా చేసి రైతులకు క్షమాపణ చెప్పాలని అన్నారు. రైతాంగం కు ఇచ్చిన హామీలను వెం...

TGTEL/25/A0827
ప్రజా దివాస్
తెలుగు దినపత్రిక
04-09-2026

# టాస్క్ కేంద్రంలో సెప్టెంబర్ 8 నుంచి కొత్త బ్యాచ్‌లు : జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

- బస్ డిపో ప్రవేశ ద్వారం పక్కా ప్రణాళికతో ఏర్పాటు చేయాలి
- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి
- ప్రభుత్వ జూనియర్ కళాశాల పునరుద్ధరణ పనులను త్వరగా పూర్తి చేయాలి
- పెద్దపల్లి జిల్లా కేంద్రంలో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్: శ్రీ హర్ష

ప్రజాదివాస్

పెద్దపల్లి జిల్లా కేంద్రంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను వేగవంతం చేసి ప్రజలకు, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు.గురువారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్ పెద్దపల్లి బస్ స్టాండ్ సమీపంలో కొనసాగుతున్న బస్ డిపో నిర్మాణ పనులు, టాస్క్ కేంద్రం, ప్రభుత్వ జూనియర్ కళాశాల పునరుద్ధరణ పనులను పరిశీలించారు.పెద్దపల్లి బస్ డిపో నిర్మాణ పనులను పరిశీలించి, పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. బస్ డిపో నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. బస్ డిపోకు ఏర్పాటు చేయనున్న ప్రవేశ ద్వారం పక్కా ప్రణాళికతో రూపొందించాలని, బస్సులు, ఇతర వాహనాల




రాకపోకలకు ఇబ్బందులు లేకుండా తగిన విధంగా ఏర్పాటు చేయాలని సూచించారు.బస్ డిపోలో ప్రయాణికులకు అవసరమైన అన్ని మౌలిక వసతులను సముచితంగా కల్పించాలని ఆదేశించారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని, పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా నిర్ణీత సమయంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.అనంతరం పెద్దపల్లి టాస్క్ కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రంలో విద్యార్థులకు అందిస్తున్న శిక్షణ, వివిధ కోర్సులు, శిక్షణ పొందుతున్న విద్యార్థుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ తదితర ఆధునిక సాంకేతిక అంశాల్లో టాస్క్ కేంద్రం ద్వారా శిక్షణ అందిస్తున్నట్లు అధికారులు వివరించారు.టాస్క్ కేంద్రంలో సెప్టెంబర్ 8 నుంచి కొత్త బ్యాచ్‌లు ప్రారంభం కానున్నందున ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆధునిక సాంకేతిక రంగాల్లో నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా మెరుగైన ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని తెలిపారు.టాస్క్ కేంద్రంలో శిక్షణ పొందిన పలువురు విద్యార్థులు ప్రముఖ బహుళజాతి సంస్థలు, ఇతర ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలు పొందుతున్నారని అధికారులు వివరించారు. ఫాక్స్‌కాన్ కంపెనీలో ఉద్యోగాలు పొందిన కొంతమంది విద్యార్థులతో జిల్లా కలెక్టర్ వీడియో కాల్ ద్వారా మాట్లాడి వారి ఉద్యోగ అనుభవాలను తెలుసుకున్నారు. టాస్క్ కేంద్రం ద్వారా అందిస్తున్న శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు.అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న పునరుద్ధరణ పనులను పరిశీలించారు. కళాశాల భవనం, తరగతి గదులు తదితర ప్రాంతాల్లో చేపడుతున్న పనుల పురోగతిని పరిశీలించారు. పునరుద్ధరణ పనులను త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.విద్యార్థులకు అనుకూలమైన విద్యా వాతావరణం కల్పించేలా కళాశాలలో అవసరమైన మౌలిక వసతులను సమకూర్చాలని, పునరుద్ధరణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సూచించారు.అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని, క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ నిర్ణీత గడువులోగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ పర్యటనలో జిల్లా ఉపాధి అధికారి ఎం. రాజశేఖర్, టాస్క్ పెద్దపల్లి ప్రాంతీయ కేంద్రం ఇన్‌చార్జి కౌసల్య, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

# శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించిన స్మైల్స్ ది స్కూల్ ఆర్మూర్

- కృష్ణుడి వేషధారణలో చిన్నారుల సందడి

ప్రజాదివాస్

ఆర్మూర్‌లోని స్మైల్స్ ది స్కూల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను గురువారం ఘనంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం చిన్నారుల కృష్ణుడు, రాధ, రుక్మిణి వేషధారణలతో సందడిగా మారింది.చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధ, రుక్మిణి వేషధారణలో పాఠశాలకు హాజరై అందరినీ ఆకట్టుకున్నారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొని, శ్రీకృష్ణుని జీవిత విశేషాలు, బోధనలు మరియు మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాల గురించి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా స్మైల్స్ ది స్కూల్ కరస్పాండెంట్ సెక్రటరీ ఁ ప్రిన్సిపాల్ షబానా గోహర్ మాట్లాడుతూ,శ్రీకృష్ణ జన్మాష్టమి వంటి పండుగలను పాఠశాలలో నిర్వహించడం ద్వారా చిన్నారులకు మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు మరియు విలువలను చిన్ననాటి నుంచే పరిచయం చేయవచ్చు. పిల్లలు ఎంతో ఉత్సాహంగా కృష్ణుడు, రాధ, రుక్మిణి వేషధారణలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉంది. ఇలాంటి కార్యక్రమాలు పిల్లల్లో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం మరియు మన సంస్కృతిపై గౌరవాన్ని పెంపొందిస్తాయి.పాఠశాల రఫీ గోహర్ మాట్లాడుతూ,పిల్లలకు విద్యతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలు మరియు నైతిక విలువలను అందించడం కూడా మా పాఠశాల ప్రధాన లక్ష్యం. శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో చిన్నారులు ఎంతో ఆనందంగా, ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయం. పిల్లల సమగ్ర అభివృద్ధికి ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయి. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు తల్లిదండ్రులకు మా హృదయపూర్వక అభినందనలు.ఈ కార్యక్రమంలో పాఠశాల




ఉపాధ్యాయులు చిన్నారులకు అవసరమైన సహకారం అందిస్తూ, వేడుకలను ఆనందోత్సాహాలతో నిర్వహించారు. విద్యార్థుల భాగస్వామ్యం, వారి వేషధారణలు మరియు ఉత్సాహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీమతి షబానా గోహర్, డైరెక్టర్ రఫీ గోహర్, ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు విద్యార్థులు అందరికీ శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు తెలిపారు.

# శ్రీ భాషిత పాఠశాలలో శ్రీ కృష్ణ జన్మాష్టమి క్షత్రియ ఫంక్షన్ హాల్ లో వేడుకలు

ప్రజాదివాస్

ఆర్మూర్ లోని శ్రీ భాషిత పాఠశాలలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు క్షత్రియ ఫంక్షన్ హాల్లో గురువారం రోజు భక్తి శ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ లహరి గోనె, 29వ వార్డ్ కౌన్సిలర్ తిరుమల సుమన్ హాజరై వేడుకలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రత్యేకంగా శ్రీ కృష్ణుడికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథుల చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని మొదలుపెట్టారు.అనంతరం విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో ముస్తాబై అందరినీ ఆకట్టుకున్నారు. చిన్నారుల కృష్ణవేషాలు, రాధా వేషాలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.విద్యార్థులు శ్రీకృష్ణుని బాల్య ఘట్టాలను ప్రతిబింబించేలా ఆకట్టుకునే



నృత్య ప్రదర్శనలు, భక్తి గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కృష్ణుడి లీలలను ప్రతిబింబించే విద్యార్థుల నృత్యాలు, పాటలు అందరినీ అలరించాయి.జన్మాష్టమి వేడుకల్లో భాగంగా ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఎంతో ఉత్సాహంగా నిర్వహించారు. విద్యార్థులు బృందాలుగా ఏర్పడి, ఆటపాటల మధ్య ఉట్టిని కొట్టేందుకు ప్రయత్నించారు. చిన్నారుల కేరింతలు, చప్పట్లతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. శ్రీ కృష్ణుడి బాల్యంలోని ఉట్టి కొట్టే ఘట్టాన్ని గుర్తుచేసేలా నిర్వహించిన ఈ కార్యక్రమం వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.పాఠశాల కరస్పాండెంట్ పోలపల్లి సుందర్ మాట్లాడుతూ, ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు మరియు పండుగల ప్రాముఖ్యతను తెలియజేయవచ్చని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించాలని సూచించారు.అంతేకాకుండాక జన్మాష్టమి వంటి పండుగలను విద్యార్థులతో కలిసి నిర్వహించడం ద్వారా వారిలో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, ఐక్యత, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్, డైరెక్టర్ కమల, ప్రిన్సిపల్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# ఏళ్లు గడుస్తున్నా ట్యాంకుల పరిస్థితిని పట్టించుకోని అధికారులు... ఎన్నిసార్లు చెప్పినా మారని నిర్లక్ష్య వైఖరి !

- ట్యాంకులు నిర్మించడం కాదు... ప్రజలకు నీరు అందించాలి !

ప్రజాదివాస్



వాంకిడి మండల కేంద్రంలోని అర్జుగూడ, శివకేశనగర్‌లో మిషన్ భగీరథ ట్యాంకులు నిర్మించి నిరుపయోగం పరిస్థితిపై బీజేపీ జిల్లా యువనాయకుడు దుర్గం ప్రశాంత్ ఆగ్రహం .ప్రజలకు నీరు అందించాలనే ఉద్దేశంతో లక్షల రూపాయల ప్రజాధనంతో, ఒక్కో ట్యాంకుకు సుమారు రూ.25 లక్షలు ఖర్చు చేసి నిర్మించిన మిషన్ భగీరథ ట్యాంకులు నేడు నిరుపయోగంగా మారడం బాధాకరం.ట్యాంకులు ఉన్నాయి...పైపులైన్లు ఉన్నాయి...ప్రజలకు నీటి అవసరం ఉంది...అయితే నీరు మాత్రం ఎందుకు రావడం లేదు?అసలు ప్రజల అవసరాల కోసం నిర్మించిన ఈ ట్యాంకులు ఉపయోగంలోకి రాకుండా ఉంటే ఇంత ప్రజాధనం ఖర్చు చేయడం వల్ల ప్రయోజనం ఏమిటి? అని దుర్గం ప్రశాంత్ ప్రశ్నించారు.వెంటనే సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, సాంకేతిక లోపాలను గుర్తించి మిషన్ భగీరథ నీటి సరఫరాను వెంటనే పునరుద్ధరించాలనీ పత్రికల ద్వారా అధికారులను కోరారు........

# కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా

ప్రజాదివాస్

వాంకిడి మండల కాంగ్రెస్ నాయకుల సంబరాలు వాంకిడి మండలం: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా వాంకిడి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సంబరాలు నిర్వహించి, అనంతరం ప్రెస్‌మీట్ నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గురున్నలే మెంగజీ మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ, పేదలు, రైతులు, మహిళలు, యువత మరియు అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు.ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు సంక్షేమ కార్యక్రమాలు, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు తదితర సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని అన్నారు."1000 రోజులు – ప్రజా పాలనకు నిదర్శనం..కాంగ్రెస్ ప్రభుత్వం – ప్రజల సంక్షేమమే లక్ష్యం" అని నాయకులు పేర్కొన్నారు.రాబోయే రోజుల్లో కూడా కాంగ్రెస్ పార్టీ ప్రజలకు మరింత చేరువగా ఉంటూ, వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో వాంకిడి మండల కాంగ్రెస్ నాయకులు, ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు మరియు కాంగ్రెస్ పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# వేములవాడ అర్బన్ మండలం: ఆరెపల్లి బడి పిల్లలకు ఉచిత యూనిఫామ్‌లు పంపిణీ చేసిన సర్పంచ్ ఇటిక్యాల రాజు

- ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య: ఆరెపల్లి సర్పంచ్

వేములవాడ / సెప్టెంబర్ 03 ప్రజాదివాస్



వేములవాడ అర్బన్ మండలం ఆరెపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం స్థానిక సర్పంచ్ ఇటిక్యాల రాజు చేతుల మీదుగా ఉచిత స్కూలు యూనిఫామ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఇటిక్యాల రాజు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పిస్తూ నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉంటారని, గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ప్రశాంత్, పాఠశాల ఉపాధ్యాయుడు తిరుపతి, మాజీ సర్పంచ్ మల్లేశం, కిసాన్ సెల్ అధ్యక్షుడు లింగయ్య, సిలువని దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు

- నందిగామలో కూటమి నేతలతో కలిసి కేక్ కట్ చేసిన ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నదాన కార్యక్రమంలో అన్న వితరణ



ప్రజాదివాస్

నందిగామ డిప్యూటీ సీఎం జనసేన పార్టీ అధినేత శ్రీ కొణిదల పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు నందిగామ పట్టణంలోని గాంధీ సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు ఈ వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కూటమి నేతలు కార్యకర్తలతో కలిసి పాల్గొన్నారుఈ సందర్భంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కేక్ కట్ చేసి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు అనంతరం కూటమి నాయకులు కార్యకర్తలతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారుపవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పాల్గొని ప్రజలకు అన్నదానం చేశారు ఈ సందర్భంగా తంగిరాల సౌమ్య మాట్లాడుతూ ప్రజాసేవే లక్ష్యంగా పనిచేస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ప్రజాప్రతినిధులు పార్టీ శ్రేణులు అభిమానులు కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# మృతుని కుటుంబానికి పరామర్శించి నివాళులు అర్పించిన..

- బిఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా ఇంచార్జ్ & మాజీ జెడ్పి చైర్ పర్సన్ బడే నాగజ్యోతి గారు
- తాడ్వాయి గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు & మాజీ ఉపసర్పంచ్ ఆలేటి ఇంద్రారెడ్డి గారి నాన్న ఆలేటి రాజిరెడ్డి .. బుధవారం రాత్రి 1 గంటల ప్రాంతాన మృతి చెందారు .
- ఈ విషయం తెలుసుకున్న బడే నాగజ్యోతి గారు ..
- ప్రగాఢ సానుభూతిని తెలిపి..
- మృతుని కుటుంబ సభ్యులకు పరామర్శించి నివాళు లర్పించారు .



అనంతరం.. వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని ఆ భగవంతున్ని మనస్పూర్తిగా కోరుకున్నారు . వారి వెంట ములుగు జిల్లా సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు దిడ్డి మోహన్ రావు తాడ్వాయి సర్పంచ్ గంట ప్రవళిక - గున్ను మాజీ పిఎసిఎస్ వైస్ చైర్మన్ ఇందారపు లాలయ్య మాజీ మండల అధ్యక్షులు నుశెట్టి రమేష్ మాజీ ప్రధాన కార్యదర్శి సయ్యద్ హుస్సేన్( వహీద్) గ్రామ కమిటీ అధ్యక్షులు రంగు సత్యనారాయణ సీనియర్ నాయకులు మల్లారెడ్డి పిన్నింటి యాదిరెడ్డి పత్తి గోపాల్ రెడ్డి రజిని కర్ రెడ్డి శివరాజ్ అరేం కృష్ణ యూత్ నాయకులు తడక హరీష్ గంట మనోజ్ రెడ్డి, మనుగొండ నవీన్ రోహిత్ తాడ్వాయి మండలం సోషల్ మీడియా ఇంచార్జ్ బందెల తిరుపతి మరియునాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాజారాం పల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు: యూనిఫామ్ పంపిణీ చేసిన సర్పంచ్ సంగ రమేష్

ప్రజాదివాస్



జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం రాజరాంపల్లి ప్రాథమిక పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బడి పిల్లలకు అందిస్తున్న యూనిఫార్మ్ మరియు బూట్లు సాక్సులు సర్పంచ్ సంగ రమేష్ చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు

# మహిళా సాధికారతే లక్ష్యం

ప్రజాదివాస్

హుగ్గెల్లీలో వివేకానంద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నాలెడ్జ్ అండ్ సర్వీసెస్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు శిక్షణ ప్రారంభం పాల్గొన్న మున్సిపల్ వైస్ చైర్మన్ కొత్తకాపు శిరీష సురేందర్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ పట్లోళ్ల విమల శ్రీనివాస్‌రెడ్డి జహీరాబాద్, సెప్టెంబర్ 3: మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించి, స్వశక్తితో ఎదగాలనే లక్ష్యంతో వివేకానంద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నాలెడ్జ్ అండ్ సర్వీసెస్ ఆధ్వర్యంలో, కోల్ ఇండియా కంపెనీ ఆర్థిక సహకారంతో హుగ్గెల్లీ గ్రామంలో మహిళా సాధికారత, నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు.గ్రామ సర్పంచ్ పట్లోళ్ల విమల శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక చొరవ, విజ్ఞప్తి మేరకు హుగ్గెల్లీ గ్రామంలో ఈ ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ వైస్ చైర్మన్ కొత్తకాపు శిరీష సురేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు ఇంటి వద్దనే ఉంటూ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని స్వయం ఉపాధి పొందేందుకు ఇలాంటి వృత్తి విద్యా శిక్షణ కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు వారి కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.సామాజిక బాధ్యతతో కోల్ ఇండియా సంస్థ ఆర్థిక సహకారంతో



వివేకానంద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నాలెడ్జ్ అండ్ సర్వీసెస్ ఉచితంగా కుట్టు శిక్షణ అందించడం అభినందనీయమని ఆమె కొనియాడారు. గ్రామీణ మహిళలకు ఇలాంటి అవకాశాలు అందుబాటులోకి రావడం ద్వారా వారు తమలోని నైపుణ్యాలను పెంపొందించుకుని స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయవచ్చని తెలిపారు. 30 మంది మహిళలకు 60 రోజుల ఉచిత శిక్షణ ఈ శిక్షణ కార్యక్రమంలో భాగంగా మొదటి బ్యాచ్‌కు ఎంపికైన 30 మంది మహిళలకు 60 రోజుల పాటు నిపుణులచే ఉచితంగా కుట్టు శిక్షణ అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన ప్రతి మహిళకు ఉచితంగా కుట్టు మిషన్ అందజేయనున్నట్లు వెల్లడించారు.ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకుని కుట్టు శిక్షణలో నైపుణ్యం సాధించి, ఇంటి వద్దనే స్వయం ఉపాధి పొందాలని కార్యక్రమంలో పాల్గొన్న వారు సూచించారు. తద్వారా మహిళలు ఇతరులపై ఆధారపడకుండా ఆర్థికంగా నిలదొక్కుకోవడంతో పాటు కుటుంబానికి



ఆర్థికంగా అండగా నిలిచే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.సర్పంచ్ చొరవపై అభినందనలు హుగ్గెల్లీ గ్రామంలో మహిళలకు ఉపయోగపడే విధంగా ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయించడంలో ప్రత్యేక చొరవ చూపిన గ్రామ సర్పంచ్ పట్లోళ్ల విమల శ్రీనివాస్‌రెడ్డిని గ్రామస్థులు అభినందించారు. మహిళలకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించే కార్యక్రమాలను గ్రామంలో మరింత విస్తృతంగా నిర్వహించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్‌రెడ్డి, ఉప సర్పంచ్ కె. మహిపాల్, వార్డు సభ్యులు బాల్‌రాజ్, ఎం. రూత్, సీనియర్ నాయకులు ప్రవీణ్‌కుమార్, శిక్షణ నిర్వాహకులు, సిబ్బంది, గ్రామ మహిళలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సంక్షేమ విద్యార్థులకు సకల సౌకర్యాలు..

- వారంలో ఒకసారి ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేయాలి అధికారులకు ఆదేశాలు ఇచ్చిన :
- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్





ప్రజాదివాస్

రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు కల్పించడమే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యం అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గురువారం జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కుమ్మరిపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో రూ. 67 లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి సహ పంక్తి భోజనం చేసిన మంత్రి విద్యార్థులకు షూస్ తోపాటు బ్యాగులను అందజేశారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ మండలంలోని తహసిల్దార్, ఎంపీడీవోలు వారంలో ఒకరోజు ప్రభుత్వ పాఠశాలను, సంక్షేమ వసతి గృహాలను తనిఖీ చేసి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు పరిశీలించాలని ఆదేశించారు.ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు చదువులో రాణించాలని మంత్రి ఈ సందర్భంగా కోరారు. రాష్ట్రంలోని సంక్షేమ శాఖ హాస్టల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యాతో పాటు పౌష్టికాహారం అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని మంత్రి తెలిపారు. కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సౌకర్యాలు కల్పించడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యం అని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ముఖ్యమంత్రి ఆలోచన ప్రకారం రాష్ట్రంలోని సంక్షేమ హాస్టల్లో చదువుతున్న విద్యార్థులకు సౌకర్యాలు కల్పిస్తున్నామని మంత్రి అడ్లూరి తెలిపారు. కుమ్మర్ పల్లి కస్తూర్బా వసతి గృహాన్ని ప్రతి నెలకు ఒకసారి సందర్శిస్తానని మంత్రి తెలిపారు. విద్యార్థులకు అవసరమైన క్రీడా మైదానం ఏర్పాటుకు చొరవ తీసుకుంటానని మంత్రి తెలిపారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు చదువులో రాణిస్తూ మంచి మార్కులు సాధించినందుకు పాఠశాల ఉపాధ్యాయులను మంత్రి ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జక్కుల ఆమని, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తాటిపర్తి శైలేందర్ రెడ్డి ఏఎంసి చైర్మన్ గోల్ల తిరుపతి వెల్గటూర్ తహాసీల్దార్ శేఖర్ ఎంపీడీవో పాడి వెంకట ప్రసాద్ ఆర్ ఐ, లు రామ్ రెడ్డి రాజేశ్వరి మాజీ సర్పంచ్ మెరుగు మురళి గౌడ్ మెరుగు నరేష్ గౌడ్ బందెల ఉదయ గౌడ్ గుమ్ముల వెంకటేష్ లా తో పాటు పలువురు అధికారులు వివిధ గ్రామాల సర్పంచులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పంచాయతీ కార్మికులకు భరోసా.. రూ.15 లక్షల ప్రమాద బీమా

ప్రజాదివాస్

గ్రామ పంచాయతీ కార్మికుల సంక్షేమానికి దమ్మపేట గ్రామపంచాయతీ ముందడుగు వేసింది. పంచాయతీ సిబ్బందికి ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ ద్వారా రూ. 15 లక్షల ప్రమాద బీమా చేయించారు. గురువారం గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు, కార్యదర్శి బండి అనంత్‌కుమార్ ఆధ్వర్యంలో ఒక్కొక్కరికి ఏడాదికి రూ. 755 ప్రీమియంతో బీమా పాలసీలు చేయించారు.ప్రమాదంలో అండగా..18 నుంచి 66 సంవత్సరాల వయస్సు ఉన్న వారు ఈ పాలసీకి అర్హులని పోస్టల్ సిబ్బంది తెలిపారు. ప్రమాదవశాత్తు



మరణం లేదా శాశ్వత అంగవైకల్యం సంభవిస్తే నామినీకి రూ. 15 లక్షలు అందుతాయని వివరించారు. పాలసీదారు మృతిచెందితే పిల్లల చదువుల కోసం రూ.లక్ష, వివాహ ఖర్చుల కోసం మరో రూ.లక్ష వరకు ప్రయోజనం పొందవచ్చన్నారు. ఆసుపత్రి చికిత్సకు రూ.లక్ష వరకు, ఐసీయూలో ఉంటే రోజుకు రూ. 2 వేలు, సాధారణ గదిలో చికిత్స పొందితే రోజుకు రూ.వెయ్యి వరకు లభిస్తుందని చెప్పారు.అదేవిధంగా చేయి లేదా కాలు విరిగితే రూ. 25 వేల వరకు, అంత్యక్రియల ఖర్చుల కోసం అదనంగా రూ. 30 వేల వరకు బీమా ప్రయోజనం ఉంటుందని తెలిపారు. తక్కువ ప్రీమియంతో తమకు రూ. 15 లక్షల ప్రమాద బీమా కల్పించడంపై పంచాయతీ సిబ్బంది సంతోషం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్‌గౌడ్, దారా రాము, రూపా రాంబాబు, చిన్నశెట్టి ముక్తేశ్వరరావు, సిబ్బంది రాఘవులు, అన్నవరం, రామకృష్ణ, రాంబాబు, నాగు, బసవయ్య తదితరులు పాల్గొన్నారు